మైళ్ళ రోడ్లు ఉంటే, అనంతపుర కడప కర్నూలు జిల్లాలలో 15-16 మైళ్ళకు మించిలేవు.

విశాల భారతంలోనే యీ తారతమ్యం భౌతిక పరిస్థితుల నంటిపెట్టుకొని ఉన్నట్లు తోస్తుంది. ఉత్తరప్రదేశములో ఉన్నన్ని రైలు మార్గాలు ఆంధ్రదేశములో ఉన్నాయా? దీని కొక ముఖ్యకారణం అక్కడి భూశయ్యా స్థితే యని చెప్పాలి. ప్రపంచంలో ఏ దేశంచూసినా, భౌతిక స్వరూపానికీ రవాణా సౌకర్యాలకు చాల సన్నిహితసంబంధం కన్పడుతుంది. ఇది ప్రత్యేకంగా రాయలసీమ జిల్లాల దురదృష్టమని మనం వాపోవ నక్కరలేదు. కాని భేదం ఒక్కటి ఉన్నది. అది చాలా ముఖ్యమయినది. జపాన్ ఇటలీవంటి దేశాలు తీసికోండి-రాయలసీమకన్నా కఠినమైన భూప్రదేశాలే, కొండలతో నిండినవే. కాని అక్కడ రవాణా సౌకర్యాలు విరివిగా ఉన్నాయి. స్విట్జర్లాండు కేవలం ఆల్పస్ పర్వతాల మీద ప్రకృతిమాత నిర్మించిన బొమ్మరిల్లు. దానికి తగినట్లు ఆ దేశప్రజలు పర్వతాల మీదకు అవలీలగా అవోక ఆటగా రైలుమార్గాలు నిర్మించారు. కారణం? వారికి తోడ్పడినదీ మనకు తలుగైనదీ...ధనసంపద. ఇదిఉండి వారు భౌతిక ఆటంకాలను జయించగల్గారు. ఇది వలసినంతగా లేక మనం భౌతిక దురదృష్టాలకు లోనువై పోతున్నాము.

క్రమక్రమంగా మనరాష్ట్రపు ఆర్థికస్థితులు సౌభాగ్యవంతమయిన పిమ్మట భౌతికంగా కష్టాలకు పాల్పడిన ప్రదేశాలకోసం తగినంత ధనం వెచ్చించి, అచ్చటి ప్రజలకు కూడ రవాణా సౌకర్యాలు, మిగత ఆర్థిక సౌకర్యాలు కలుగ చేయవలసియుంటుంది. ఈ సందర్భంలో మరొక విషయం మనం జ్ఞాపకముంచుకోవాలి. మనుష్యులలాగనే ప్రపంచంలోని భూభాగముకూడ అన్నీ ఒకేతీరుగా ఉండవు. కొన్ని పల్లముగా, కొన్ని ఎత్తుగా, కొన్ని వర్షముకల్గి, కొన్ని లేక-ఈవిధంగా భేదాలతోనిండిఉంటాయి. వేటికితగినఅవకాశాలు వాటికిఉండనేఉంటాయి. రాయలసీమ జిల్లాలలో పండే కొన్ని మెట్టపంటలు మిగతచోట్ల బాగా పండవు. రాయలసీమలోవలె మిగతచోట్ల ఉన్న పరిశ్రమ పెరగదు. ఇంతకుమించి రాయలసీమలో ఉన్నతంగా ఖనిజసంపద యితర ఆంధ్రప్రాంతాలలో లేదు. కాబట్టి ఎవరి ప్రత్యేక వస్తుసముదాయం వారికి ఉంటుంది. ఇది గ్రహించి ఏ ప్రదేశాలు ఏమార్గాలు త్రొక్కితే ఆంధ్రదేశం మొత్తానికి సౌభాగ్యం చేకూరుతుందో అలా చేయ ప్రయత్నించాలి.

ఆంధ్రరాష్ట్రపు మొట్టమొదటి కర్తవ్య మేమంటే తెలుగునాడులో నలుమూలలా పరిశోధనలు చేయించి, ఏ జిల్లాలో ఏ తాలూకాలో ఏ పల్లెలో ఏయేవిధమగు భౌతికపరిస్థితులున్నాయో భూమియొక్క తీరు, సారవంతపుచేవ ఎటులున్నవో ప్రస్తుతము నేల ఏయే విధాలుగా ఉపయోగంలో పెట్టబడుతున్నదో వివరంగా విషయ సంగ్రహణ చేయాలి. దానినిబట్టి, భావి ఆంధ్ర రాష్ట్రపు ఆర్థికవ్యవస్థాస్వరూపం నిర్ణయించుకోవచ్చును. (ఆలిండియా రేడియో సౌజన్యంతో)

స్కెచ్

"కలడో—లేడో"

కొంపల్లి సూర్యారావు

"లావొక్కింతయులేదు"అంటూ గజేంద్రుడు అరిచేసరికి సిరికేనా చెప్పకండా పరిగెత్తేడూ అంటే అప్పటివాళ్ళ భక్తే అల్లాటిదో లేక అప్పటి దేవుడే అల్లాటివాడో! మరి ఇప్పుడక్కడా ప్రజారాజ్యమే నేమో, పిలిస్తే ఎవడూ పలకడంలేదు-మన భక్తిలోనే ఎడల్ప రేషనుందో!

అప్పుడు పిలిస్తే పలికేవాడు కనక భక్తికూడా పెంపయి ఉత్సాహంగా ఉండేది. ఎవరికేనా దాఖలాకనిపిస్తే హుషారుగా ఉంటుంది. ఇప్పుడు ఏభైసత్యనారాయణ వ్రతాలు చేసినాఫలితం లేకపోవడంచేత ఉన్నాడో లేడో! అని అనుమానం వస్తోంటుంది. ఉత్సాహం రానురానుతగ్గుతోంది.

రామదాసు కాలంలో - తానీషాకి ప్రత్యక్ష మయాడనీ సొమ్ము చెల్లించేడనీ ఏదేదో కోసేరు. కాని రామదాసు బందిఖానాలో కూర్చుని భక్తి చేతనో-బాధచేతనో, భూషించేడు, దూషించేడు. "నా డబ్బు నాకక్కడ కక్కమన్నాడు— సీతమ్మకి చింతాకు పతకం చేయించేను పదివేల వరహాలు పెట్టి-అంటూ ఇంకా ఏదో ఏకాంటు అంతా యాకరవు పెట్టేడు. కాని రామదాసు భక్తి నాటకంలో చాలా పొరపాట్లొచ్చేయి. గవర్నమెంటు రివెన్యూ వాడిబాబు సొమ్ములా వాడెయ్యడం. అదేనా పదిమంది బీదలకి పంచి పెట్టడం కాదు ఇంకో అవునన్న సద్వినియోగం కాదు. సీతమ్మకి వస్తువులక్రింద తగలేసేడు. ఇంకొకడి పెళ్ళానికి వీడెవడు వస్తువులు చేయించడానికి? పోనీమని చేయించినవాడు చేయించినట్టుండక వెళ్ళివెళ్ళి దాని మొగుడుతోటే! చేసినవన్నీ పొరపాట్లే. "ఊంచండి బందిఖానాలో" అన్నారు. పదకొండో రోజున ఫుల్‌స్టాప్ అయిపోయేడు.

మావూళ్ళో ఒక రాజుగారు సత్యనారాయణ వ్రతం చేసేడు. ఆయన దగ్గరవున్న బత్తాయి మొక్కకి మంచి గిరాకీవచ్చింది. మళ్ళీ యేడు మళ్ళీ చేసేడు. మళ్ళీ లాభంవచ్చింది. అయిదేళ్లు చేసేడు. అయిదేళ్ళూ బాగుంది. ఆరవయేడు చేసేడు మొక్కంతా చచ్చిపోయింది. మళ్ళీ చెయ్యడం మానేసేడు.

భక్తిలోపమా! దేవుడులేని లోపమా! మా "వసంతం" జబ్బుకి సత్యనారాయణ కొండకొస్తానని మొక్కుకున్నాడు. తండ్రి అనుగ్రహంవల్ల జబ్బు తగ్గిందన్నారు. నాలుగేళ్ళవరకూ వెళ్ళలేకపోయేను. ఇంతట్లో మా "జెన్నీ"కి జబ్బుచేసింది. సత్యనారాయణమూర్తికీ, తిరపతి వెంకటేశ్వర్లుకీ కూడా మొక్కుకున్నాను. దేవుళ్లూ, మహాత్యాలూ కూడా తగ్గేయో, మనది అరువు చేరమని అనుమానంవచ్చిందో— మా "జెన్నీ" పోయేడు. దానితో సత్యనారాయణ పాతమొక్కకూడా రద్దు అయిపోయింది.

నాకు "ఒద్దు," మొర్రో అంటోంటే నన్ను "పెళ్ళాడతా"నని కూచుందోపిల్ల. "ఏమిట్రా, భగవంతుడా, ఇల్లావచ్చిం పరిస్థితి" అని ఆలోచిస్తూంటే మా అమ్మ "చేసుకుంటేకానివల్లకా"దని పట్టుపట్టింది. మా అమ్మ మంచంమీదుంది ఈవేళో, రేపో అన్న పరిస్థితిలో. ఆ పిల్లకి కబురు పెట్టింది. మూడుగంటలకి వస్తుంది.

"లావొక్కింతయులేదు" జ్ఞాపకం వచ్చింది. తప్పించునే విధానం ఏమిటి? మూడుగంటలకి ఆ పిల్లా, నేనూ, మా అమ్మదగ్గిర నిలబడి "పెళ్ళి చేసుకుంటాం"అని మాటివ్వాలి.

ఎల్లాంటిచిక్కు తెచ్చిపెట్టేవురా భగవంతుడా! "పాలముంచినా - నీటముంచినా-నీవే..."బుర్ర గట్టిగా విదిపేసుకుని కుర్చీలో చతికిల పడ్డాను. "లావొక్కింతయులేదు"బుర్రలో తిరుగుతోంది. మూడుగంటలు కావొస్తూంది. తలుపుచప్పుడైంది. గుండెఝల్లుమంది- ఆపిల్లకాబోలు "లావొక్కింతయులేదు" ఆ పిల్లకాదు, ఎవరో— "లావొక్కింతయు...'ఛా-వెధవ గొడవ-మనబ్రతుక్కి ఎప్పుడూ ఏదో గొడవే, శాంతిలేదు-శంకరా-దీనదయాపరా' "లావొక్కింతయులేదు- లావొక్కింతయులేదు" "అబ్బ" చురుక్కుమని కుట్టింది. "అయ్యబాబోయ్" అని గట్టిగా నలిపేసేను. చూస్తూండగా రూళ్ళకర్రంతలావయింది - వేలు. పక్కన నవ్వొచ్చింది. భగవంతుడున్నాడల్లేవుంది. మనకంటె కొంటిముండాకొడుకై వుంటాడు. "పాలముంచినా, నీటముంచినా నీవే..." అని వేడుకుంటే పాలలోముంచి చచ్చేవరకూ అట్టే పెట్టేరకం.

ఈ వ్రతాలూ, మొక్కులూ, కొండలకెళ్ళడాలూ, దేవుడికి నిలువుదోపిళ్ళూ, స్వార్థపరతా, దొంగనాటకాలూ-ఎవడు సంతోషిస్తాడు? మాట మంచితో, మనసుమంచితో పదిమందికి ఉపకారం చెయ్యి-లేనివాళ్ళకి తిండిపెట్టు. కనపడని దేవుడికి 'దో'పక్కరలేదు. కనపడే మనుష్యుల్ని సంతోషపెట్టు. మెచ్చుకుంటారు- జన్మతరిస్తుంది!

"కలడు కలండనెడివాడు కలడో-లేడో!"